క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రానికి కంచాలు, గ్లాసుల వితరణ



స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు డాక్టర్ భాస్కరరావు వీధి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు స్వీట్లు, స్టీల్ కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. మహిళా నాయకురాలు ఇంజే వరలక్ష్మి మనుమడు గ్రీతిక్ అయాన్ పుట్టినరోజు సందర్భంగా 50 మంది చిన్నారులకు వీటిని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నిర్వాహకురాలు విజయకుమారి, నాయకులు జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్, చేట్ల ఎల్లయ్యరెడ్డి, డబ్బీరు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలని వినతి

భీమునిపట్నం: తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీఐటీయూ జోన్ అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తున్న నేపథ్యంలో ఆటోవాళ్లకు ఆదాయం పూర్తిగా పడిపోయిందన్నారు. దీనివల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందని, ఆటో అద్దెలు, ఫైనాన్స్ కట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం స్పందించి, వారికి జీవనభృతి కల్పించాలని కోరారు. జోన్ కార్యదర్శి అప్పలనాయుడు, ఆటో యూనియన్ నాయకులు నమ్మి అప్పలనాయుడు, పల్లా రమణ, శ్రీను, శివారెడ్డి, ఎర్రిబాబు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీకాంత్

పీఎం పాలెం: వ్యక్తి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. స్థానికంగా సేల్స్‌మన్‌గా పని చేస్తున్న మద్దుల శ్రీకాంత్ (38) వైఎస్సార్ కాలనీలోని బ్లాకు నంబరు 22, జీఎఫ్-1 లో కుటుంబంతో కలసి నివసిస్తున్నాడు. ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన అతడు, మళ్లీ తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. చుట్టుపక్కల వెదికించినా ఆచూకీ లభించకపోవడంతో శ్రీకాంత్ భార్య భారతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలి



ప్రాజెక్ట్ అధికారి శ్రీదేవికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

భీమునిపట్నం: తమ వేతనాలను పెంచాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు భీమిలిలోని శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి శ్రీదేవికి గురువారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా వేతనాలు పెరగకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జూలై నెలకు తమ వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇంతవరకు జరగలేదన్నారు. ఇప్పటికైనా వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ

భీమునిపట్నం: ఆర్థిక అక్షరాస్యత గురించి విద్యార్థులు అవగాహన ఏర్పరచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై కళాశాల వద్ద గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దీనికి సంబంధించి బ్యాంకులు, బీమా సంస్థలు అందిస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి, అధ్యాపకులు సహదేవుడు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దూసుకొస్తున్నాయ్..

- ప్రమాదకరంగా సంగివలస ఫ్లై ఓవర్ నుంచి దిగువ మార్గం
- పల్లపు రహదారిపై వేగంగా వస్తున్న వాహనాలు
- స్టాపర్లు లేక తరచూ ప్రమాదాలు
- హడలిపోతున్న విద్యార్థులు, ప్రయాణికులు

విద్యార్థులే ఎక్కువ



విశాఖ, విజయనగరం, మధురవాడ, పెందుర్తి, శొంఠ్యాం ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరంతా ఎక్కువగా ఈ జంక్షన్ల వద్దే దిగుతారు. హైవేపై వేచి ఉండాల్సిన పరిస్థితి. చర్యలు తీసుకోవాలి.
–సంతోష్, సంతపేట



విశాఖ నుంచి విజయనగరం వైపు పల్లపు రహదారిపై వస్తున్న వాహనాలు



బస్సుల కోసం జాతీయ రహదారిపై ప్రయాణికులు, విద్యార్థులు



వెంకటేశ్వరమెట్ట వద్ద హైవేపై స్టాపర్ దుస్థితి



బాలాజీనగర్ ఫ్లై ఓవర్ మలుపు మీద వేగంగా వస్తున్న కారు



విశాఖ వెళ్లే బంగ్లామెట్ట జాతీయ రహదారి వద్ద వేచి ఉన్న విద్యార్థులు

తగరపువలస: వాహనాలు వేగంగా దూసుకొస్తున్నాయి. చిట్టివలస ఈఎస్ఐ కూడలి వద్ద జాతీయ రహదారి ఫ్లై ఓవర్ నుంచి బాలాజీనగర్, బంగ్లామెట్ట, వెంకటేశ్వరమెట్ట కూడళ్ల మీదుగా గోస్తనీనది వంతెన వరకు సుమారు 800 మీటర్లు పొడవైన రహదారిపై మూడు మలుపులతో పాటు పల్లంగా ఉంటుంది. దీంతో సంగివలస ఫ్లై ఓవర్ ఎక్కిన తరువాత వాహనాల వేగానికి కళ్లెం పడక దిగువకు దూసుకువస్తున్నాయి. వెంకటేశ్వరమెట్ట, బంగ్లా మెట్ట వద్ద జాతీయ రహదారిపై వేచి ఉన్న, రోడ్డు దాటుతున్న ప్రయాణికుల పట్ల ఇవి మృత్యు శకటాలుగా మారుతున్నాయి. ఈ ప్రమాదకరమైన మార్గంలో ఒకటో రెండో తప్ప స్టాపర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉన్న స్టాపర్లు కూడా పాతవి కావడంతో చీకటివేళ ఇవే మరింత ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

ఉత్తరాంధ్ర జిల్లాల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు, సర్వీస్ రోడ్లపై కాకుండా జాతీయరహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలకు ఎదురీది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ముఖ్యంగా ప్రయాణికుల కోసం హైవేపై ఆగిన బస్సులను భారీ వాహనాల వేగాన్ని అదుపు చేసుకోలేక ఢీ కొడుతున్నాయి. ఒక్కోసారి ప్రమాదాలను తప్పించే ప్రయత్నంలో డివైడర్‌పై చేరి ప్రాణ నష్టం కలిగిస్తున్నాయి. నిత్యం ఈ ప్రాంతంలో ఏదో ఒక ప్రమాదం జరుగుతుండంటంతో ఒళ్లు గగుర్పొడిచే వాతావరణం చూసి ప్రయాణికులు హడలిపోతున్నారు.

బస్సులను అంబేడ్కర్ కూడలి మీదుగా పంపించాలి



బస్సులు అంబేడ్కరు కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తే ఏ ప్రయాణికుడూ జాతీయరహదారిపై వేచి ఉండవలసిన అవసరం ఉండదు. ప్రమాదాలు కూడా జరగవు. బంగ్లామెట్ట వద్ద కింది రోడ్డులో దిగిన వాహనాల కోసం ఏర్పాటు చేసిన మలుపు అత్యంత ప్రమాదకరమైనది. అక్కడ వాహనాల వేగాన్ని నియంత్రించగలగాలి.
–ఏలూరు రాంబాబు, తగరపువలస

స్టాపర్లు ఏర్పాటు చేయాలి



అసలే జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువ. నిముషానికి వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా సంగివలస, బంగ్లామెట్ట, వెంకటేశ్వరమెట్ట వద్ద కూడళ్లు దాటుతుంటారు. అయినా ఈ ప్రాంతాల మధ్య స్టాపర్లు ఏర్పాటు చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.
– చిల్ల గణేష్‌రెడ్డి, చిల్లపేట

ఇలా చేస్తే మేలు

నిత్యం జరుగుతున్న ప్రమాదాల నివారణకు పలువురు చేస్తున్న సూచనలివీ..

- వెంకటేశ్వరమెట్ట, బంగ్లామెట్ట కూడళ్లను ఏకం చేసి సిగ్నల్స్‌తో కూడిన సర్కిల్ ఏర్పాటు చేసి పోలీసు సిబ్బందిని ఉంచాలి.
- ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అన్నింటినీ ఆనందపురం నుంచి తగరపువలస వరకు సర్వీస్ రోడ్లపై నడుపుతూ పూర్వంవలె అంబేడ్కరు కూడలి మీదుగా రాకపోకలు సాగించాలి. లేదా వెంటనే బంగ్లామెట్ట వద్ద ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించాలి.
- బంగ్లామెట్ట నుంచి వెంకటేశ్వరమెట్ట రోడ్డు దాటడానికి డివైడర్‌పై రెయిలింగ్ ఏర్పాటు చేసి ప్రయాణికులు దాటడానికి ఫుట్ ఓవర్ వంతెన ఏర్పాటు చేయాలి.
- నిత్యం రద్దీగా ఉండే తగరపువలసను ఆనుకుని జాతీయ రహదారి మలుపులపై జిగ్‌జాగ్ పద్ధతిలో స్టాపర్లు ఉంచి వాహనాల వేగం తగ్గించవచ్చు.
- తాళ్లవలస, తగరపువలస, వలందపేట, సంగివలస జాతీయరహదారి కూడళ్లతో పాటు ఇరువైపులా వీధిలైట్లు వెలిగేలా చూడాలి.



డివైడర్‌పై లారీ దూసుకుపోయిన ఆనవాళ్లు

ఆశయం ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలి

- తల్లిదండ్రులు అన్నీ ఇవ్వరు
- మనమే కష్టపడి సాధించాలి
- కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ రామ్‌గోపాల్ నాయుడు



మేజర్ రామ్‌గోపాల్ నాయుడు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు

మధురవాడ: విద్యార్థుల ఆశయం ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని, అందుకు అనుగుణంగా శ్రమించి, సాధించాలని కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ రామ్‌గోపాల్ నాయుడు అన్నారు. తల్లిదండ్రులు అన్నీ ఇవ్వరని, మనమే బాగా కష్టపడి సాధించుకోవాలని తెలిపారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేజర్ రామ్‌గోపాల్ నాయుడు దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేజర్ మాట్లాడుతూ పట్టుదల, నిలకడ, సహనమే తన విజయానికి సోపానాలుగా నిలిచాయని తెలిపారు. తాను ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలోనే చదివి సైనిక్ స్కూల్లో సీటు సాధించినట్టు చెప్పారు. ఏడో తరగతిలో తాను ఫెయిల్ అయ్యానని, అదే తన చివరి ఫెయిల్యూర్ అని తెలిపారు. ఆ ఓటమిని చాలెంజ్‌గా తీసుకుని మరింత కష్టపడి చదివానని, 20 ఏళ్లకే నేషనల్ డిఫెన్స్ అకాడమీకి సెలక్ట్ అయ్యానని చెప్పారు. తనకు సివిల్స్ చేయాలని ఉన్నా రక్షణ రంగంలో ఉంటే దేశానికి మరింత సేవ చేయగలమన్న ఉపాధ్యాయుల సూచనతో ఇందులోకి వచ్చానన్నారు. అక్కడ కూడా జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రెసిడెంట్ మెడల్ పొందానని తెలిపారు. ఓటమిని ధైర్యంగా ఎదుర్కోవాలని, ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించేవరకు పట్టు వదలకూడదని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి మొమెంటో అందించి, అభినందించారు. కార్యక్రమంలో మేజర్ టీఎస్ రావు, డాక్టర్ ఎంఎస్‌వీ పల్లవి, హెచ్‌ఎం ఎం.వెంకటరావు, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నవరం తీరంలో ఇసుక చోరీ

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం, ఎర్రయ్యపాలెం తీరం నుంచి రెండు నెలలుగా రాత్రి వేళ కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుకను తరలించుకుపోతున్నారు. దీనిపై పంచాయతీకి చెందిన కొందరు మత్స్యకార యువకులు రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తున్నారు. డీవీస్ జెట్టీకి సమీపంలో ఇసుక తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు ఉన్నాయని వారంటున్నారు. జెట్టీ వద్ద ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా ఇసుక తవ్వకాలు, తరలింపుపై నిర్ధారణ చేసుకోవాలని కోరుతున్నారు. ఈ తీరంలోని ఇసుకలో విలువైన ఖనిజాలు ఉన్నాయని, గతంలోనూ లారీలతో ఇసుకను హైదరాబాద్‌కు తరలించారు.

1బీతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



వీఆర్వోలతో సమీక్షిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అప్పలస్వామి

పద్మనాభం: అర్హులై ఉండి అన్నదాత సుఖీభవ రానివారు 1బీతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కె.అప్పలస్వామి సూచించారు. అన్నదాత సుఖీభవ పథకంపై వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులతో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సచివాలయానికి వెళ్లి 1బీతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. పట్టాదారులు మృతి చెందినట్లయితే వారి వారసులు పట్టాదారు పాస్ పుస్తకాలు చేయించుకోవాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా ఇంకా ఎవరైనా అన్నదాత సుఖీభవ పథకం అందని వారు ఉన్నారేమో అని సమీక్షించారు. కార్యక్రమంలో ఏవోలు ఎంవీఎస్ చలం, సురేష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు



శ్రీ కృష్ణుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు, ఎంపీపీ రాంబాబు దంపతులు

పద్మనాభం: మండలంలోని మద్దిలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిలిపిన శ్రీకృష్ణుడికి నిత్యపూజలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆరో రోజైన గురువారం భక్తులతో పాటు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, తులసి దంపతులు పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్న వారిలో త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇందు జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాధరావు, సభ్యులు జి.కృష్ణ సూరప్పడు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా తాటిచెట్లపాలెం, దసపల్లా లేఅవుట్, సుభాష్‌నగర్, ముసలయ్యపాలెం, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తాళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలో..

తగరపువలస: భీమిలి మండలం 33/11 కేవీ తాళ్లవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా తాళ్లవలస, యాతపేట, చిన్నిపేట, ఎస్సీ కాలనీ, గొల్లల తాళ్లవలస, గొల్లలపాలెం, రెయిన్‌బో లే అవుట్‌కు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- కాపులుప్పాడ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు. ఈ కారణంగా రామాద్రి, మంగమారిపేట, తిమ్మాపురం, కాపుల దిబ్బడిపాలెం, కె.నగరపాలెం, రెడ్డీలపాలెం, సోమన్నపాలెం, గ్రేహౌండ్స్, కల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పద్మనాభం మండల పరిధిలో..

పద్మనాభం: ఫీడర్లపై చెట్ల కొమ్మలు తొలగించనున్నందున శుక్రవారం పలు గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా తునివలస, నరసాపురం, చిన్నాపురం, విజయానందపురం, నేరేళ్లవలస, పొట్నూరు, కురపల్లి, బర్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మారికవలస సబ్‌స్టేషన్ పరిధిలో..

మధురవాడ: మారికవలస విద్యుత్ సబ్ స్టేషన్ పరదేశిపాలెం, మారికవలస 11కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా పరదేశిపాలెం ఈడబ్ల్యూఎస్ లే అవుట్, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, జీవీఎంసీ కాపులుప్పాడ డంపింగ్ ఇండస్ట్రీస్, చిలుకూరి లే అవుట్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

గణపతి ఉత్సవాల్లో డీజే నిషిద్ధం



గణపతి ఉత్సవాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ వాసునాయుడు

తగరపువలస: ఆనందపురం మండలంలో నిర్వహించే గణపతి ఉత్సవాలలో డీజేకు అనుమతులు లేవని సీఐ చింతల వాసునాయుడు తెలిపారు. ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఉత్సవాల సౌండ్ సిస్టమ్, ఉత్సవాల నిర్వాహకులతో గురువారం ఆయన మాట్లాడారు. ఎక్కడా 9 రోజులకు మించి పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. పర్యావరణానికి హాని కలగని విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండపం వద్ద చిన్నపాటి శబ్దం వచ్చే మైక్‌లు తప్ప మిగిలినవి వాడకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పందిరి శివ, గంట్యాడ సంతోష్, రైటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య గ్యాస్ సిలిండర్ల వ్యాన్

పాండ్రంగి వాసుల్లో ఆందోళన



పాండ్రంగిలో నిలిపిన గ్యాస్ సిలిండర్ల వ్యాన్

తగరపువలస: పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలో రాత్రి వేళ ఇళ్ల మధ్య గ్యాస్ సిలిండర్ల వ్యాన్‌ను నిలిపి ఉంచడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఫిషింగ్ హార్బర్ వద్ద సిలిండర్ పేలిన సంఘటనలో పలువురు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేసుకుని కలవరపడుతున్నారు. సిలిండర్ల డెలివరీ తరువాత వ్యాన్‌ను గ్రామం మధ్యలో ఉంచకుండా, దూరంగా తరలించాలని పాండ్రంగి వాసులు కోరుతున్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు లారీలకు జరిమానా



సీజ్ చేసిన లారీలు

పద్మనాభం: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు లారీలకు రెవెన్యూ అధికారులు జరిమానా విధించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలివీ.. గురువారం తెల్లవారు జామున ఐదు గంటల సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న మూడు లారీలను సీఐ శ్రీధర్ పట్టుకుని, సీజ్ చేశారు. వీటిని రెవెన్యూ అధికారుల వద్ద ప్రవేశపెట్టగా ఒక్కొక్క లారీకి రూ.5 వేలు చొప్పున మూడు లారీలకు రూ.15 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నదుల అనుసంధానంతో దేశం అభివృద్ధి

దీక్ష ప్రారంభించిన సంఘమిత్ర సూరిబాబు



దీక్ష చేస్తున్న సూరిబాబు

బీచ్‌రోడ్డు: దేశంలోని జీవనదులను అనుసంధానం చేస్తే అద్భుతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా అమెరికాను కూడా అధిగమించవచ్చని సంఘమిత్ర సూరిబాబు అన్నారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మూడు రోజుల దీక్షను ఆయన ప్రారంభించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి సూరిబాబుకు పూలమాల వేసి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ నాగావళి, సువర్ణముఖి, వేగవతి, గోస్తని వంటి నదులను అనుసంధానం చేయడం వల్ల ఉత్తరాంధ్ర రైతులు కరువు అనే మాటను పూర్తిగా మర్చిపోతారన్నారు. నీటి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండవని, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఒక కొత్త దశ మొదలవుతుందని చెప్పారు. భారతదేశంలో సహజ వనరులు ఉన్నప్పటికీ, నదుల అనుసంధానం కేవలం రాజకీయ వాగ్దానాలకే పరిమితం కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు సూరప్పడు, తులసి, ఆశ, దుర్గ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయం ప్రారంభం



వాణిజ్య సముదాయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం: భీమిలి మెయిన్‌రోడ్డు పక్కన కొత్తగా నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ అవసరమైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ వాణిజ్య సముదాయం వల్ల వ్యాపారులు, ప్రజలకు ఎంతో సదుపాయంగా ఉంటుందన్నారు. భీమిలి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. భోగాపురం విమానాశ్రయం వచ్చే సంవత్సరానికి పూర్తి కావస్తున్న నేపథ్యంలో త్వరలో భీమిలి–తగరపువలస రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయని, అది ఎన్ని అడుగుల మేరకు ఉండాలో పరిశీలించి నిర్ణయిస్తామన్నారు. బీచ్‌రోడ్డులో అవసరమైన మేరకు రక్షణ గోడ నిర్మిస్తామన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలను త్వరలో జీవీఎంసీలో విలీనం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారి లక్ష్మి, జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల నిరసన

తగరపువలస: కార్మికుల పెన్షన్లు కనీసం రూ.7500లకు పెంచాలని కోరుతూ ఈ నెల 25న కలెక్టరేట్ల వద్ద నిరసన చేపట్టనున్నట్టు చిట్టివలస జ్యూట్‌మిల్స్ పెన్షనర్ల సంఘం తెలియజేసింది. గుజ్జు రాము నాయుడు భవన్‌లో గురువారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో నాయకులు మాట్లాడారు. పెన్షనర్ల డిమాండ్లు నెరవేర్చే దిశగా ప్రధాని మోదీ, మంత్రులు కనీసం ఆలోచనలు చేయడం లేదన్నారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు కానూరి రాంబాబు, దామోదర బాబాజీ, మోర అప్పలరాజు, అప్పారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.